

తీగల వంతెన సర్కిల్ లో పనిచేయని ఫౌంటేన్



తెలంగాణ చౌక్ లో పనిచేయని లైట్లు, ఫౌంటేన్లు

మూన్నాళ్ల ముచ్చటగా జంక్షన్ల హంగులు

- పనిచేయని పౌంటేన్లు... వెలగని లైట్లు
- ప్రజాధనం దుర్వినియోగంపై విమర్శలు

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన జంక్షన్ల సుందరీకరణ పనులు మూడునాళ్ల ముచ్చటగా మిగిలిపోయాయి. రెండేళ్ల క్రితం కరీంనగర్‌లోని ప్రధాన జంక్షన్లను ఆదునిక హంగులతో సుందరీకరణ చేశారు. నగర వాసులు సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి వరకు జంక్షన్ వద్ద నిలబడి సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేవారు. రాత్రి వేళలో నగరంలోకి కొత్తగా వచ్చినవారు జంక్షన్లను, ప్రధాన రహదారులను చూసి ఇది కరీంనగరేనా అంటూ ఆశ్చర్యపోయేవారు. ఒక్కో జంక్షన్‌కు 50 లక్షల చొప్పున ఖర్చుచేసి వివిధ డిజైన్లతో ఆధునిక హంగులతో అభివృద్ధి చేశారు. రెండేళ్లు కూడా తిరుగక ముందే జంక్షన్ల హంగులు తగ్గాయి. లైట్లు వెలగడం లేదు. ఫౌంటేన్లు పని చేయడ లేదు. నగర నడిబొడ్డున తెలంగాణచౌక్‌లోని ఇందిరాగాంధీ జంక్షన్‌ను అత్యధికంగా 1.06 కోట్లతో సుందరీకరించారు. అత్యాధునిక హంగులతో సుందరంగా తీర్చిదిద్దిన ఈ జంక్షన్‌ను చూసి నగర వాసులు సంతోషపడ్డారు. జంక్షన్ సొబుగులు రెండేళ్ళకే కనుమరుగై పోయాయి. ఇప్పుడు ఈ జంక్షన్‌లో లైట్లు కూడా వెలగడం లేదు. ఆర్టీసీ బస్‌స్టేసన్ ఇన్‌గేట్ ఎదట శ్రీపాద జంక్షన్, మారుతీనగర్‌చౌరస్తాలోని పడవ నమూనాతో కూడిన జంక్షన్, తీగలవంతెన సమీపంలో రెండు జంక్షన్లను, కోర్టు చౌరస్తా జంక్షన్‌ను, నాకా చౌరస్తా జంక్షన్‌ను, కార్ఖానగడ్డ గాంధీ జంక్షన్‌ను, సుడా నిధులతో మంచిర్యాల చౌరస్తా జంక్షన్‌ను, కమాన్ జంక్షన్‌ను లక్షలతో సుందరీకరించారు. వాటన్నింటి పరిస్థితీ ఇంతే.. వన్‌టౌన్ పోలీసు స్టేసన్ ఎదుట చొక్కారావు, తెలంగాణతల్లి జంక్షన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అవి ఇప్పటికీ పూర్తికాలేదు.. జంక్షన్ల ఏర్పాటులో భారీ అవినీతి జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. పనుల్లో నాణ్యత లేక పోవడం, లక్షలు వెచ్చించిన ఈ జంక్షన్ల నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం జంక్షన్ల సుందరీకరణ, అభివృద్ధి, నిర్వహణపై దృష్టి సారించాలని, అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తిరిగి ఫౌంటైన్లు, లైటింగ్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



బోట్ చౌరస్తా వద్ద పనిచేయని ఫౌంటేన్



'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

బీఆర్ఎస్‌ను వీడను.. బీజేపీలో చేరను

ఇంటర్వ్యూ

- బండి సంజయ్‌తో ఉన్నది స్నేహబంధమే
- నాకెవరితో గొడవ లేదు... డిప్యూటీ మేయర్ మనసులో ఏముందో తెలియదు
- అవినీతి అనేది గిట్టనివారి ప్రచారం
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా రాజకీయాలకు కేంద్రం కరీంనగర్ కార్పొరేషన్. ఈ కార్పొరేషన్ మేయర్ పదవికి అత్యంత రాజకీయ ప్రాధాన్యం ఉంది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న సుమారు 80శాతం మంది కార్పొరేషన్ పరిధిలోనే ఉంటారు. జిల్లా రాజకీయాల్లో ఎమ్మెల్యేల స్థాయిలో ఇక్కడి మేయర్‌కు రాజకీయంగా పెద్దపీట వేస్తుంటారు. అలాంటి మేయర్ పదవిలో ఉన్న యాదగిరి సునీల్‌రావు ఇప్పుడు జిల్లాలో చర్చకు కేంద్రంగా మారారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికై మేయర్ పదవిని చేపట్టిన ఆయన ఆ పార్టీని వీడి బీజేపీలో చేరేందుకు బాటలు వేసుకుంటున్నారంటూ ప్రచారం జరుగుతోంది. కౌన్సిలర్ పదవి నుంచి కేంద్ర మంత్రి పదవికి ఎదిగిన బండి సంజయ్‌కుమార్‌తో ఉన్న సాన్నిహిత్యమే ఇప్పుడు రాజకీయంగా పలు అనుమానాలకు దారితీస్తున్నది. ఒక వైపు పార్టీ మారుతున్నారంటూ ప్రచారం.. మరోవైపు డిప్యూటీ మేయర్‌తో పొసగని వ్యవహారం.. ఇంకో వైపు స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి అక్ర మాలు చోటు చేసుకున్నాయంటూ ఆరోపణలు రావడం సునీల్‌రావును వివాదాల తెరపైకి తెచ్చాయి. సునీల్‌రావు రాజకీయంగా ఎటు అడుగులు వేయనున్నారు.. ఆయన ఏ పార్టీలో చేరనున్నారు.. బీజేపీలో చేరి కేంద్ర మంత్రి బండి సంజయ్ బాటలో నడుస్తారా... బీఆర్ఎస్‌లోనే ఉండి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పనిచేస్తారా అంటూ రాజకీయంగా ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. ఈనేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ముచ్చటించింది. బీజేపీలో చేరుతారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. స్మార్ట్‌సిటీలో జరిగాయంటున్న అవినీతి అక్రమాలు తన ఎదుగుదలను చూసి గిట్టనివారు చేస్తున్న ప్రచారంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ క్రమ శిక్షణగల కార్యకర్తగా పనిచేస్తానన్నారు. .

ఆంధ్రజ్యోతి: ఇటీవలి కాలంలో మీరు బీజేపీలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. అక్కడ ఏమైనా పదవి హామీ పొందారా?

మేయర్: బీజేపీలో చేరుతానని ప్రచారం జరుగుతున్న విషయం నా దృష్టికి కూడా వచ్చింది. అయితే ఇందులో ఏమాత్రం వాస్తవం లేదు. కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంపీగా, కరీంనగర్ కార్పొరేషన్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ఎంపీగా ఉన్న కాలంలో కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపులో ఎంతో సహకరించారు. కేంద్రమంత్రిగా ఆ సహకారాన్ని కొనసాగించాలని కోరడానికే

మిగతా 8వ పేజీలో... ..

జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

భగత్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శిమిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ప్రజా వ్యతిరేక విధానాలు-మన కర్తవ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అనే నినాదానికి కొనసాగింపుగానే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా జమిలి ఎన్నికలు నిర్వహించాలని చూస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై నిత్యావసర ధరలు పెంచుతూ పెను భారం మోపుతుందన్నారు. మహిళలపై రోజుకు 86 కంటే ఎక్కువ కేసులు వెలుగు చూడడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జి ముకుందరెడ్డి, జి సత్యం, యు శ్రీనివాస్, రమేష్, రాజేశం, అశోక్, వామన్‌రావు, రమణ, తిరుపతినాయక్, శ్రీకాంత్, అరవింద్, శ్రీనివాస్, బషీర్, సంపత్ పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా స్వావలంబన సాధించాలి

భగత్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సహకార భారతి జాతీయ కార్యదర్శి నందిని రాయ్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార భారతి రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికోసం దేశవ్యాప్తంగా సహకార భారతి కృషి చేస్తోందన్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సహకారంతో ఏదైనా సాధించవచ్చని, అందుకోసం సహకార సంఘాలునిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ సహకార భారతి రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చింతకుంట అధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య మాట్లాడుతూ సహకార సహాలు దేశ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, రాష్ట్ర నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రమేష్‌రెడ్డి, తిరుపతి, సురేందర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం

- సమస్యల పరిష్కారానికి సమ్మెకు వెనకాడం
- కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సాధించుకోవడానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల ఆత్మాభిమానం నిలుపుకోవడానికి ఉద్యమ కార్యచరణకు సిద్ధమని కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో భాగస్వామ్య సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రతినెల మొదటి తారీఖున జీతలు ఇస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయలు, పెన్షనర్లు ప్రభుత్వంలో భాగమన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు హక్కుగా రావలసిన కనీస చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తామని, తమది ప్రజా ప్రభుత్వమని పేర్కొంటూ ఈ రోజు వరకు జేఏసీ నాయకులను చర్చలకు పిలవకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు మంజూరు చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన పీఆర్సీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు భరోసా కల్పించే హెల్త్‌స్కీం, ఇతర డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం వెంటనే నష్ట నివారణకు చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర జేఏసీ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని, పెద్ద ఎత్తున ఉద్యమ నిర్మాణం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కట్ట రవీంద్రాచారి, పీఆర్ శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, తూముల తిరుపతి, నరహరి, గోనె శ్రీనివాస్, ముల్కల కుమార్, ఆదర్శన్‌రెడ్డి, ఎంఏ ఖాద్రి, ఖాజ మంజూర్‌అలీ, కరుణాకర్, చంద్రశేఖర్, వెలిచాల వెంకటస్వామి, పాతూరి రాజిరెడ్డి, ఎం రామ్మోహన్, కోట రామస్వామి, వెంకన్న, నర్సయ్య, ఎంఏ హమీద్, పి కేశవరెడ్డి, సురేందర్‌రెడ్డి, శశిధర్‌శర్మ, శారద, లలితమేరి, మహేందర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, నాగరాజు, కిరణ్‌కుమార్, రమేశ్, సునీత, సరిత, విజయలక్ష్మి, సుష్మిత, స్వరూప, ఏవి రాజేశ్వర్‌రావు, సర్దార్ హర్మిందర్‌సింగ్, సుమంత్‌రావు, కొండయ్య, పి కిషన్, నాగరాజు, జలాలుద్దీర్‌అక్బర్, బల్బీర్‌సింగ్, లవకుమార్, కరుణాకర్, కమలాకర్, అజ్గర్, నర్సయ్య, అభిషేక్, గిరిధర్‌రావు, అజయ్ పాల్గొన్నారు.

ఇది ఫొటోలకు ఫోజులు ఇచ్చే ప్రభుత్వం

- స్థానిక ఎన్నికలు ఎప్పుడు పెట్టిన బీఆర్ఎస్ వాళ్లే గెలుస్తారు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజి మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

తిమ్మాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పథకాల ప్రభు త్వం పోయి ఫొటోలకు ఫోజులు ఇచ్చే ప్రభుత్వం వచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం మాజి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని చూస్తే 2001 నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఉద్యమం సమయంలో ధూందాం పేరిట ప్రజలను జాగృతం చేసిన రసమయి బాలకిషన్ అలాయ్ బలయ్ పేరిట తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం మీద పోరాటానికి ఆయుధం సిద్ధం చేశాడన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మీద పోరాటానికి మరో ధూంధాం మొదలు పెట్టె రోజులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రామాల్లోని రచ్చబండ వద్ద చర్చలు పెట్టాలని, ప్రజలకు, రైతులకు, యువతకు అందరికి అర్థమయ్యే విధంగా వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు పెట్టినా మానకొండూర్‌లో బీఆర్ఎస్ వాళ్లే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు.


- రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితం ఆశాజనకంగా ఉండదని ముందే తెలుసని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. గెలిస్తే ప్రజల దగ్గరికి ఓడిపోతే రాజకీయాలకు దూరంగా ఉండేవాడు రాజకీయ నాయకుడు కాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం అని మాజి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధీమా వ్యక్తం చేశారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలను చూస్తే ఓడిన తరువాతనే మరింత బాధ్యత పెరిగినట్లనిపిస్తోందన్నారు. పదేళ్లు రైతులను కాపాడుకున్నం కాని కాంగ్రెస్ పది నెలల పాలనల్లోనే రైతులకు కన్నీళ్ళు తెప్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

గణేశ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతులకు పూర్తి స్థాయిలె రుణమాఫీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతు రుణమాఫీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత



ఎల్‌ఎండి గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి మిడ్ మానేరు నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఆదివారం ఉదయం ఏడు గంటలకు నీటి పారుదల శాఖ అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎల్‌ఎండీ 24.034 టీఎంసీలతో పూర్తి స్థాయి నీటి సామర్థ్యానికి చేరుకుంది. ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో 4,800, ఔట్‌ఫ్లో 4277 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

జమ్మికుంట.. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా గుర్తింపు ఉన్న పట్టణం.. రైల్వే లైన్ ఉండడంతో ఈ పట్టణానికి ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వచ్చి స్థిరపడ్డారు. సరుకు రవాణా సులభంగా అవుతుండడంతో ఈ మార్కెట్‌కు ఉత్తర తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. నిజాం హయాంలో 1944లో మార్కెట్‌ను ప్రారంభించారు. వందల్లో ప్రారంభమైన లావాదేవీలు ప్రస్తుతం కోట్ల రూపాయలకు చేరాయి. మార్కెట్ విస్తరణ పలు దశల్లో జరిగింది. .
దాన్యం, ఆపరాలతో ప్రారంభమైన మార్కెట్‌లో క్రమంగా పత్తి అమ్మకాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు పత్తి అమ్మకాలకు కేరాఫ్‌గా మారిది. ఈ మార్కెట్‌ను నమ్ముకుని వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు.

జమ్మికుంట కొత్త మార్కెట్ ప్రధాన ముఖ ద్వారం



తెల్ల బంగారానికి c/o జమ్మికుంట మార్కెట్

జమ్మికుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలిచి రైతులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు ఇలా ఎంతో మందికి ఉపాధిని కల్పించి జమ్మికుంట ప్రాంత అభివృద్ధిలో కీలకంగా నిలిచింది. వేలాది మంది కార్మికులకు ఉపాధి ఇవ్వడంతోపాటు వ్యాపారుల ఎదుగుదలకు తోడ్పాటును అందించింది. జమ్మికుంట అభివృద్ధికి వెన్ను దన్నుగా నిలిచిన వ్యవసాయ మార్కెట్ ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నిలిచింది.

1944లో ప్రారంభం

జమ్మికుంట పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌ను 1944లో నెలకోల్పారు. 1950లో నిర్మించిన మార్కెట్ భవనాన్ని అప్పటి హైద్రాబాద్ సంస్థాన



నాడు కనీసం రెండు రోజులు.. నేడు గంటల్లోనే..

జమ్మికుంట పట్టణంతో పాటు పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కమలాపూర్, మొగుళ్లపల్లి, చిట్యాల, వీణవంక, హుజూరాబాద్, సైదాపూర్ ఇలా అనేక ప్రాంతాల నుండి ఎడ్ల బండ్లపై రైతులు అప్పట్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడకు తీసుకువచ్చే వారు. నిత్యం నలభై వేల వరకు పత్తి భస్తాలు విక్రయానికి వచ్చేవి. తెల్లవారు జామున తమ వ్యవసాయ ఉత్పత్తులతో మార్కెట్‌కు వచ్చిన రైతులు మరుసటి రోజు తెల్లవారు జాము వరకు అక్కడే ఉండేవారు. తూకాలు అయిపోగానే రసీదు పట్టుకోని అడ్తీదారు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్లే సరికి రాత్రి అయ్యేది. వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకుని ఇంటికి చేరుకోవాలంటే రైతులకు కనీసం రెండు రోజుల సమయం పట్టేది. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతు తన సరుకులు విక్రయించుకోని గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికి చేరుకుంటున్నాడు. రవాణా సౌకర్యం మెరుగు పడడం, ఆన్‌లైన్ తూకాలు, ఆన్‌లైన్ పేమేంట్లతో రైతులకు అవస్థలు తప్పాయని చెప్పవచ్చు.

70 ఏళ్ల ఘన చరిత్ర

- ఏటా లక్షల క్వింటాళ్ల సరుకుల క్రయ విక్రయాలు
- వందల కోట్ల టర్నోవర్

ప్రధానమంత్రి ఎంకే వెల్లోడి ప్రారంభించారు. మార్కెట్ యార్డు 9.32 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆ సమయంలో ఆపరాలు, పల్లికాయ, ధాన్యం విక్రయాలు మాత్రమే జరిగేవి. పట్టణంలో నాలుగు ఆయిల్ మిల్లులు ఉండేవి. ఈ ప్రాంతంలో క్రమేణా పత్తి పంట సాగు పెరిగింది. మార్కెట్‌కు పత్తి రాక పెరగడంతో ధాన్యం, ఆపరాలకు చోటు సరిపోలేదు. దీంతో పత్తి విక్రయాల కోసం ప్రతేకంగా నూతన మార్కెట్ యార్డు నిర్మించాలని అప్పటి పాలకులు భావించారు. 2003లో కోట్లాది రూపాయాలు వెచ్చించి 16.28ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు నిర్మించారు. అప్పటి మంత్రి ముద్దాసాని దామోదర్‌రెడ్డి మార్కెట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి పాత మార్కెట్ యార్డులో ధాన్యం, అపరాలు, కొత్త మార్కెట్ యార్డులో పత్తి విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం

జమ్మికుంట మార్కెట్లో ప్రతి ఏటా లక్షలాది క్వింటాళ్ల ధాన్యం, పత్తి విక్రయాలు జరుగుతుంటాయి. వందల కోట్ల టర్నోవర్ జరుగుతుంది. పత్తి, ధాన్యం కొనుగోళ్లపై వ్యాపారులు మార్కెట్‌కు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ పరిధిలో ఉన్న 17 గోదాములు అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రతి ఏటా 40 లక్షలు, ట్రేడింగ్ లైసెన్స్‌ల రెన్యూవల్స్ కలిపి ప్రతి ఏటా ఆరు కోట్ల నుంచి ఏడు కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. 2013లో 10 కోట్ల రూపాయల ఆదాయంతో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. జమికుంట మార్కెట్‌తో ప్రత్యక్షంగా వెయ్యి మంది, వందల సంఖ్యలో పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. లైసెన్స్ ఉన్న వ్యాపారులు 72 మంది ఉన్నారు.

- ఉద్యమాలకు కేంద్రం

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయానికి తీసుకు వచ్చే రైతులు ఉదయం 6గంటల లోపు యార్డుకు రావాల్సి ఉంటుంది. ఐదు నిమిషాలు ఆలస్యమైనా మార్కెట్ మెయిన్ గేట్ మూసేవారు. దీంతో కిలో మీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి ఉండేవి. మధ్యాహ్నం వరకు గేట్లు తీయని సందర్భాల్లో రైతులు తీవ్ర అసహానానికి లోనై నిరసనలు చేపట్టేవారు. వ్యాపారులు నాణ్యత పేరిటా పత్తి ధరల్లో అధిక తేడాలు వేసిన సందర్భాల్లో రైతులు ఆగ్రహావేశాలకు లోనయ్యేవారు. మెయిన్ గేట్‌కు తాళం వేసి, కార్యాలయంలో అధికారులను నిర్బంధించేవారు. పలు మార్లు మార్కెట్ ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఘటనల్లో రైతులపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ధాన్యం కోసం గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, కొత్త మార్కెట్లు ఏర్పాటయినా జమ్మికుంట మార్కెట్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది.



మార్కెట్‌కు వచ్చిన పత్తి (ఫైల్)

క్రైం కార్నర్

కృష్ణా నదిలో మునిగి యువకుడి మృతి

- సీతంపేటలో విషాదం



వేణుగోపాల్(ఫైల్)

ఇల్లందకుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు దైవ దర్శనానికి వెళ్లి కృష్ణా నదిలో మునిగి మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. గ్రామస్థులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట గ్రామానికి చెందిన పోతన రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్(38) ఈ నెల 17న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలోని దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న కృష్ణా నదిలో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి మునిగిపోయాడు. రెండు రోజులుగా నది పక్కనే బ్యాగ్ ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు గాలింపు చేపట్టగా సంఘటన స్థలం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ బ్యాగు చోరీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్ రాజయ్య బ్యాగు శనివారం రాత్రి చోరీకి గురైంది. హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి వచ్చిన రాజయ్య కమాన్ వద్ద బస్సు దిగి ఎదురు చూస్తుండగా, ఆటోలో ముగ్గురు వ్యక్తులు వచ్చి రాజయ్య చేతిలో ఉన్న బ్యాగు లాక్కెళ్లారు. ఇంతలో రాజయ్యను పికప్ చేసుకునే వ్యక్తి రాగానే దుండగులు వెళ్లిన దారిని వెంబడించారు. క్రిసెంట్ స్కూల్ వద్ద ఆటోను పట్టుకోగా ఆటోలో ఉన్న వ్యక్తులు పారిపోయారు. బ్యాగులో భూములకు సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని, నగదు లేదని తెలిపారు. పోలీసులు ఆటోను పోలీస్‌స్టేషన్లో ఉంచారు. పట్టణానికి చెందిన డ్రైవర్ రెహాన్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకుంటానని హంగామా చేశాడు. తన ఆటోను ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇంట్లో ఉన్న బంగారం మాయం

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో దాచిన బంగారం చోరీకి గురయ్యింది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేష్ భార్య శ్యామల దసరా పండుగ సందర్భంగా ఆభరణాలు ధరించి తర్వాత దాచిపెట్టింది. గురువారం తెరిచి చూడగా మొత్తం ఆరు తులాల బంగారం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. అయితే బాధితులు ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి

- గొర్రెల కాపరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి గొర్రెలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన సంచార జీవి సాయిలు గొర్రెలను పచ్చునూర్ వైపు నుంచి లలితాపూర్ వైపు తరలిస్తున్నాడు. ఆ సమయంలో మానకొండూర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న కారు లలితాపూర్ గ్రామ శివారులో గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి సాయిలుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ సాయిలును కరీంనగర్‌కు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి పట్టివేత



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్ మిలీనియం క్వార్టర్స్ సమీపంలో గంజాయి సేవిస్తున్న మార్కండేయకాలనీకి చెందిన అక్రమ్, ఆసీఫ్‌లను పట్టుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి 80గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. గోదావరిఖని పట్టణంలో గంజాయి, డ్రగ్స్ లేకుండా చేయలనే ఉద్దేశంతో మూడు కేసుల్లో 16 కిలోల గంజాయిని పట్టుకోవడమే కాకుండా 24 మందిని అరెస్టు చేశామన్నారు. మరో 43 మందిని కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగుర్తిలో ఆదివారం విద్యుదాఘాతంతో ఏఎల్ఎంకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేగుర్తిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పనిచేయడం లేదనే రైతుల సమాచారం మేరకు ఏఎల్ఎంలు శ్రీకాంత్, అమర్‌లు అక్కడికి వెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా చేసే ఏబీ స్విచ్చాఫ్ చేయాల్సిందిగా ఏఎల్ఎం అమర్‌కు శ్రీకాంత్ చెప్పాడు. అమర్ ఏబీ స్విచ్చాఫ్ చేయకముందే శ్రీకాంత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. రైతులు వెంటనే చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్‌ను ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వి గంగాధర్, డీఈ రాజం, ఏడీఈ రఘు, బొమ్మకల్ ఏడీ అనిల్‌కుమార్ పరామర్శించారు. చాతిపై చర్మం కాలిపోయిందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

ఎల్ఎండీలో పడి యువకుడి మృతి



సాయికుమార్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యువకుడు దిగువ మానేరు జలాశయంలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బూర సాయికుమార్(29) హైదారాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నట్లు తండ్రికి ఫోన్‌చేసి చెప్పిన సాయికుమార్ రాత్రి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం మహాత్మానగర్‌లోని శ్రీతాపాల నరసింహ స్వామి ఆలయం సమీపంలో దిగువ మానేరు జలాశయంలో సాయికుమార్ మృతదేహం ఉన్నట్లు తండ్రికి సమాచారం అందింది. అప్పటికే సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నరేష్, లక్ష్మీనారాయణ మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం సాయికుమార్‌దిగా గుర్తించారు. శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన సాయికు మార్ నీటిలో పడి మృతి చెందాడని తండ్రి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వీణవంక, పాలకుర్తి, ఇల్లందకుంట మండలాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వీణవంక మండలం ఇప్పలపల్లిలో జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ, పాలకుర్తి మండలం పుట్నూర్‌లో మనోవేదనతో వివాహిత, ఇల్లందకుంట మండల కేంద్రంలో ఓ వృద్దురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

- అనారోగ్యంతో బాధపడుతూ..

వీణవంక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఉరివేసుకుని ఓ మహిళా ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) చొప్పదండిలోని ఇరిగేషన్ డిపార్ట్ మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. పదేళ్ల క్రితం సంగీత భర్త కొండయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అనంతరం కూతురు కిరణ్మయితో పాటు సంగీత తన తల్లిగారి ఊరు ఇప్పలపల్లిలో ఉంటోంది. రెండునెలలుగా సంగీత అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లోని పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు సంగీత తల్లి ఆకునూరి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

- మనోవేదనకు గురై..



చెలిమేటి సంధ్య(ఫైల్)

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుట్నూర్‌లో ఆదివారం ఉదయం ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పుట్నూర్ గ్రామానికి చెందిన చెలిమేటి సంధ్య(32) అనే వివాహిత సంవత్సరం నుంచి ఫిట్స్ మానసిక వ్యాధితో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చనిపోయింది. మృతురాలు సంధ్య అన్న ముడిమడుగుల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త సత్యనారాయణ, కూతురు వాసవి ఉన్నారు.

బావిలో దూకి వృద్దురాలు..

ఇల్లందకుంట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు శనివారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కనుమల్ల భూమమ్మ(82) రెండేళ్ల క్రితం కాలు జారి కింద పడగా తొంటి విరిగింది. కొంత మేర నయమైనప్పటికీ నొప్పితో అవస్థలు పడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి ఇల్లందకుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భూమమ్మ బంధువు సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

-ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల ఎంపికకు విశేష స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. సుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా ఖో-ఖో పోటీలను నిర్వహించి ప్రతిభచాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు వంగపల్లి సూర్యప్రకాశ్, సీఐ కుమారస్వామి, కట్ట సంతోష్, ఎస్కే మొయిను ద్దీన్, శివకుమార్, గెల్లు మధుకర్, సంధ్య, కరుణాకర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఖో-ఖో సంఘం ప్రతినిధులు

మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి..

- క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న ఇదిలాపూర్ యువకుడు
- డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో ఎంపికైన సాహిత్ కుమార్



తల్లిదండ్రులతో బాల్త సాహిత్ కుమార్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన బాల్త సాహిత్ కుమార్ డొమెస్టిక్ క్రికెట్ క్లబ్ లెవెల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు.. శ్రీలంకలో జరిగే అండర్-19 క్రికెట్ పోటీలకు బాల్త సాహిత్ కుమార్ ఈనెల 26న కొలంబోలో జరిగే అంతర్జాతీయ క్లబ్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా ఆడనున్నాడు. సాహిత్ కుమార్ తండ్రి గ్రామంలో వ్యవసాయంతో పాటు చిన్న హోటల్ నడిపిస్తున్నాడు. యూకేజీ నుంచి పదో తరగతి వరకు ముత్తారం గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యాలయంలో చదివాడు. ఇంటర్మీడియెట్ హన్మకొండ లాల్ బహదూర్ కాలేజీలో పూర్తిచేసి, హైదరాబాదులో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నాడు. సాహిత్ కుమార్‌కు క్రికెట్‌పై ఆసక్తిని గుర్తించిన తండ్రి రవీందర్ హైదరాబాదులోని నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్‌లో చేర్పించాడు. కోచింగ్ తీసుకుంటూనే పూణే, బెంగళూరు, చెన్నై, టి20, వన్ డే క్రికెట్ మ్యాచ్‌ల్లో పాల్గొని తన సత్తా చాటుకున్నాడు. దీంతో నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ శ్రీలంకలోని కొలంబోలో జరిగే ఇంటర్నేషనల్ అండర్-19 డొమెస్టిక్ క్లబ్ లెవెల్ క్రికెట్ పోటీలకు సాహిత్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న పోటీలకు సాహిత్ కుమార్ హాజరుకానున్నాడు. మారుమూల గ్రామం నుంచి ఇంటర్నేషనల్ పోటీలకు సాహిత్ కుమార్ ఎంపిక కావడంతో ఇదిలాపూర్ గ్రామంతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంతర్జాతీయ క్రికెటర్ గా ఎదగాలని నా కోరిక

- బాల్త సాహిత్ కుమార్

అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగాలని నా కోరిక. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. హైదరాబాద్ నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటూ చెన్నై, పూణే, బెంగళూరులో జరిగిన పోటీల్లో ఆల్ రౌండర్‌గా పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చానని, నా ప్రతిభను చూసి నివియా స్పోర్ట్స్ క్లబ్ అకాడమీ అండర్ 19 విభాగంలో శ్రీలంకలోని కొలంబొలో జరుగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేసింది. మా నాన్న రవీందర్ వ్యవసాయంతో పాటు హోటల్ నడుపుకుంటూ క్రికెట్‌లో నాకు ప్రోత్సాహం అందిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- గోదావరిఖని ఏసీపీ రమేష్

- ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్ ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ మడత రమేష్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో స్పోర్ట్స్ కరాటే హెడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ స్కూల్ గేమ్స్ జోనల్ లెవల్ కరాటే టోర్నమెంట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పిల్లలు చిన్న నాటి నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో జ్ఞానం పెరగడంతో పాటు శారీరధారుఢ్యం పెరుగుతుందని, పైచదువులకు వెళ్లేటప్పుడు క్రీడలు ఉపయోగపడుతాయన్నారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు క్రీడా సర్టిఫికెట్ల కోటాలో సీట్లు సాధిస్తున్నారని, అంతేకాకుండా ఉద్యోగాల్లో కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తున్నాయని ఆయన వివరించారు. గోదావరిఖనిలో కరాటే పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ఏసీపీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, తగరపు శంకర్, రాజిరెడ్డి, పసునూటి శంకర్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.


● **రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక**

నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు అండర్-14 బాలికల విభాగంలో మనస్విని, అద్విత, శ్రీవర్షిణి, సహస్ర, శృశిత, సహస్ర, శాన్వి, ముక్తశ్రీ, శ్రీనిధి, సహస్ర, సుల్తానా, అండర్-14 బాలుర విభాగంలో మణిదీప్, శ్రీరాజ్, సాయి, కుర్షిద్, చౌహాన్, విశ్వక్‌సేన్, రిశ్వంత్, అబ్దుల్ ముజీబ్, రిషికేష్, సూర్య ప్రభావ్ ఎంపికయ్యారు.

'కాలనీ'లో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. అండర్-14 బాలుర విభాగంలో పెద్దపల్లి జట్టు కరీంనగర్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుపొందింది. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు పెద్దపల్లి జట్టుపై గెలిచింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జక్కుల దామోదర్‌రావు హాజరయ్యారు. స్పందన మోడల్ స్కూల్ నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాల పాఠశాలల పీఈటీలు, ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం


నాంపల్లి గుట్టపైన ఏర్పాటు చేసిన కాళీయమర్దనం


వేములవాడ నాంపల్లి గుట్ట వద్ద ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులు, సందర్శకులను ఆకట్టుకుంటుంది. చుట్టూ పచ్చని పొలాలు.. మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి. ప్రధానంగా గుట్ట మధ్య భాగంలో కాళీయమర్ధనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

- నాంపల్లి గుట్టపై లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం
- ప్రకృతి రమణీయంగా ఆలయ పరిసరాలు
- ప్రత్యేక ఆకర్షణగా కాళీయమర్ధనం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. గుట్టపైన మూడు నామాల రూపంలో లక్ష్మీనృసింహస్వామి ప్రతిమ వెలిసింది. ఆ ప్రతిమకు కుడివైపున హనుమంతుడి ప్రతిమ ఉంటుంది. చోళుల కాలం నుంచి స్వామివారికి పూజలు జరుగుతున్నట్లు ఆధారాలు చెబుతు న్నాయి. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులకు ఆహ్లాదం పంచుతుంది. గుట్ట చుట్టూ పచ్చటి పంటపొలాలు, మూలవాగు, మానేరు వాగుల ప్రవాహం.. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తాయి.

● **గుట్టపై కాళీయమర్దనం**

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003లో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు కాళీయమర్ధనాన్ని నిర్మించారు. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతోపాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు. నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్ల చొరకల్లో ఉన్న ధర్మగుండం సుమారు వెయ్యి ఏళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టలతో లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజ సిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతోపాటు పలు విగ్రహాలు ఉన్నాయి.


నాంపల్లి గుట్ట పైనుంచి కనువిందు చేస్తున్న మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ వ్యూ

● **పార్శ్వనాథుడు, హన్మంతుని ప్రతిమలు**

నవనాథ సిద్దులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, నిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని చేరుకొని పూజలు చేసేవారు. అందులో 12వ శతాబ్దానికి సంబంధించిన జైనమతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయిపై కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గుట్టకు నాలుగు వైపుల పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.

వీటీడీఏ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు



నాంపల్లి గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం వీటీడీఏ (వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికర సంస్థ) ఆధ్వర్యంలో నాంపల్లి గుట్ట అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఊహచిత్రాలు విడుదల చేసింది. నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉంటుంది. దీంతో నాంపల్లి గుట్టపైకి రోప్‌వే నిర్మాణం, ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు, ధర్మగుండాల సుందరీకరణ, వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ధ్యానమందిరం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం చొరవ తీసుకొని నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులు, సందర్శకులు కోరుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

- హడలిపోతున్న ప్రజలు


రుద్రంగి ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రుద్రంగి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో వీధికుక్కలు యథేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. రుద్రంగిలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. కుక్కల బెడద విపరీతంగా పెరగడంతో చిన్నారులతో పాటు పెద్దవారు భయాందోళనకు గురవుతున్నారు. నెలల తరబడి కుక్కల సమస్య వెంటాడుతున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. చికెన్ సెంటర్లు, ఫ్రై సెంటర్లు వాటికి సంబంధించిన వ్యర్థాలను రోడ్లపై పాడేయడంతో వీధి కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. రాత్రివేళలో వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై ద్వీచక్ర వాహనలపై వెళ్లే వాహనదారులపై కుక్కలు వెంట పడటంతో చాలా మంది ప్రమాదాలకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఇటీవల ఇందిరాచౌక్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై కుక్కల గుంపు వెంట పడటంతో కాలు విరిగింది.

కొన్ని ప్రాంతాల్లో పిచ్చికుక్కలు చిన్నారులపై దాడి చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో పాఠశాల నుంచి వచ్చే విద్యార్థుల వెంటపడడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీంతో చిన్నారులు అరుపులు వేయడంతో కుక్కలను తరిమేందుకు స్థానికులు కర్రలు పట్టుకుని తరమడంతో అవి పారిపోయాయి అని గ్రామస్థులు తెలిపారు. పిచ్చికుక్కలు తిరగడంతో చిన్నారుల ను బయటకు పంపేందుకు ఆందోళనకు గురికావాల్సి వస్తోందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని కోరుతున్నారు. గ్రామంలో కుక్కలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారంతపు సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు


స్వామి వారలకు హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య లోక కళ్యాణార్థం శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరో హితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు సాయికుమార్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, పాల్గొన్నారు.

పశువులపై హైనా దాడులు

- ఆందోళనలో రైతులు



చిగురుమామిడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, నవాబుపేట, ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల పశువులపై హైనా దాడులు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి కాలంలో చిగురుమామిడి, నవాబుపేట గ్రామాల్లో హైనా దాడిలో పశువులు మృతి చెందాయి.

అధికారులు సంఘటన జరిగిన సందర్భంలోనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారని, అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పశువులు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపో తున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందజేయాలి..

- ఎలగందలు రాజు, రైతు సుందరగిరి

మండలంలో హైనా దాడులు చేసి పశువులను హతమార్చుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బాధిత రైతులకు పరిహారం కూడా అందడం లేదు. అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలి. హైనా దాడిలో పశువులు మృతి చెందిన రైతులకు పరిహారం అందజేయాలి.

జాతీయస్థాయిలో పతకాలు సాధించాలి

-రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. ఆదివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులకు జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ యోగా క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించి అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఊనాలో జరిగే జాతీయ యోగాసన చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. జాతీయస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. 8-10 సంవత్సరాల విభగంలో డి కృపా సూరజ్, 10-12 విభాగంలో బి సాకేత్, ఎన్ ఆదిత్య, 12-14 విభాగంలో పి దీపక్, టి హర్షిత్, బాలాజీ, 14-16 విభగంలో బి ఇందుప్రియ, 16-18 విభాగంలో పి అభికుమార్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల యోగా కోచ్ వి కిష్టయ్య, ఆనంద్, కుమార్, కోటేశ్వర్‌రావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

-ఎస్‌ఈ గంగాధర్

కరీంనగర్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ కేబుల్ తెగిపోవడంతో నాలుగు గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రైల్వే కేబుల్ తవ్వుతుండగా కరెంటు వైర్లు కట్ అనే శీర్షికన వచ్చిన కథనానికి ఎస్‌ఈ స్పందించారు. చేగుర్తిలో ఏఎల్ఎం శ్రీకాంత్ విద్యుదాఘాతంతో గాయపడటంతో ఎస్‌ఈ గంగాధర్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గుంటూరుపల్లి వద్ద తెగిపోయిన అండర్ గ్రౌండ్ కేబుల్‌ను తనిఖీ చేశారు. కేబుల్ మరమ్మతు పనులను పూర్తి చేసి సోమవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఎస్‌ఈ వెంట ఏడీ రాజాం, ఏడీఈ రఘు, ఏఈ అనిల్ కుమార్‌లు ఉన్నారు.

నీరు ఎత్తి పోసేదెప్పుడో..?

నిరుపయోగంగా కొత్తపేట ఎత్తిపోతల పథకం

262 ఎకరాలకు సాగునీరు

వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు


కొత్తపేటలోని ఎత్తిపోతల పథకం

రాయికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాయికల్ మండలం కొత్తపేటలో భూములను సస్యశ్యామలం చేసేందుకు 2003-04 సంవత్సరంలో రూ.26 లక్షల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉండటంతో యంత్రాలన్నీ తుప్పు పట్టిపోయాయి. దీంతో ఎత్తిపోతల ద్వారా వ్యవసాయం చేయలేక రైతులు బావులపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ మండలం కొత్తపేటలో రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్‌రావు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 262 ఎకరాలు ఎత్తిపోతల పథకం ద్వారా సాగయ్యేవి. ఈ పథకం పనిచేయకపోవడంతో రైతులకు సరిపడా సాగునీరు లేకపోవడంతో మామిడి పంటలపై దృష్టి సారించారు. ఈ గ్రామంలో ఎస్సారెస్పీ నీరుసైతం సరిగా రాకపోవడంతో కేవలం వ్యవసాయ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ హయాంలో మంత్రులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి..

మాదం రమేష్, కొత్త పేట



గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. మా గ్రామంలోని 262 ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతలు ప్రారంభించాలి.

యంత్రాలు పని చేయడం లేదు..

బత్తిని రాజేశం, తాజా మాజీ సర్పంచ్



మా గ్రామంలోని ఎత్తిపోతల పథకం యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. సాగునీటి కోసం జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయగా, దీనిని పట్టించుకునే నాథుడే లేడు. మా గ్రామంలో ఎస్సారెస్పీ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించాలి.

తమ్ముడి చేతిలో అన్న హతం

ఆస్తి తగాదాలే కారణం


సాయిలు(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఆస్తి కోసం సొంత అన్ననే తమ్ముడు హతమార్చిన ఘటన ఆదివారం కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలు(34)ను తన తమ్ముడు చంద్రి ఆదివారం హత్య చేశాడు. సాయిలు కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి ఆరు నెలల క్రితమే స్వగ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రులు ఆస్తి పంపకాలు చేయకపోవడంతో ఇంటి సమీపంలో నడక దారి విషయంలో అన్నదమ్ములిద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అన్న సాయిలుపై తమ్ముడు చంద్రి కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సాయిలు బయటకు వెళ్లటాన్ని గమనించిన తమ్ముడు ఇంట్లో నుంచి కత్తి తీసుకుని అతడి వెనకాలే వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లాక కత్తిలో సాయిలు తల నరికి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రజాప్రతినిధికి దేహశుద్ధి

మానకొండూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకవర్గంలోని ఓ గ్రామ మాజీ ప్రజాప్రతినిధికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఇంటికి రాత్రి వేళలో మాజీ ప్రజాప్రతినిధి నాలుగు రోజుల క్రితం వచ్చాడు. గ్రామస్థులు దేహశుద్ధి చేసి మందలించి వదిలిపెట్టినట్లు తెలిసింది.

గీత కార్మికుడికి గాయాలు

చొప్పదండి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుగట్టు గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే గీత కార్మికుడు ఈత చెట్టుపై నుంచి జారీ పడగా తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

క్రీడల్లో తేజస్ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న తేజస్ చైర్మన్ సతీష్‌రావు

భగత్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో తేజస్ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను చైర్మన్ సిహెచ్ సతీష్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఎం ప్రేమ్‌కుమార్, పి సంతోష్, బిరాజు, వేదాంత్‌లు మెడల్స్ సాధించారన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్‌జిఎఫ్ క్రీడల్లో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ఎస్ సుమేద్, ప్రద్యుమ్న ప్రతిభ చాటారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి వెంకటయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు.

వీరులారా వందనం..

-సమాజంలో శాంతిస్థాపన కోసం పోలీసుల బలిదానాలు
- నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిస్థాపన కోసం పలువురు పోలీసులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారు. వారిని సంస్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21 పోలీసు అమర వీరుల దినోత్సవం నిర్వహిస్తారు. పోలీసులు 24 గంటలు విధులు నిర్వహిస్తూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారు.

● పోలీసు అమర వీరుల దినోత్సవ నేపథ్యం...

1959 సంవత్సరం అక్టోబరు 21న.. చైనా సరిహద్దు ప్రాంతంలోని అక్సాయ్‌చిన్ ప్రాంతంలో కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది బృందం పహారా కాస్తున్నాయి. ఈ సమయంలో చైనా బలగాలు ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్రయత్నించే క్రమంలో దాడులు జరిపాయి. సీఆర్‌పీఎఫ్ బలగాలు వారితో



వీరోచితంగా పోరాడాయి. ఈ దాడిలో చైనా బలగాలు డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలోని బృందంపై గ్రనేడ్‌లతో దాడులు జరపగా డీఎస్పీ కరమ్‌సింగ్‌తోపాటు 10 మంది జవాన్లు వీరమరణం పొందారు. ఈ సంఘటనలో అసువులు బాసిన వీర సైనికుల త్యాగాలను గుర్తించిన భారత ప్రభుత్వం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా ప్రకటించింది.

● 47 మంది పోలీస్ అమరులు

ఉమ్మడి జిల్లాలో 1985 నుంచి విధి నిర్వహణలో ఇప్పటి వరకు తీవ్రవాదులు, అసాంఘిక శక్తులతో పోరాటం జరిపిన సందర్భాల్లో 47 మంది పోలీసులు వీరమరణం చెందారు. విధి నిర్వహణలో అమరులైన అన్ని పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు ఇంకా అందలేదు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో సోమవారం పోలీసు అమరుల దినోత్సవం నిర్వహించనున్నారు.

'క్రీడా రంగానికి ప్రాధాన్యం'

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 20: ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రంలో క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ సమావేశ మందిరంలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పీఈటీల నుంచి పీడీలుగా పదోన్నతులు పొందిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఉత్తర తెలంగాణ కేంద్రంగా అతిపెద్ద స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండి యూనిస్ పాషా, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్ పాల్గొన్నారు.

'పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ కోరారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఈనెల 28న రాజీనామా చేస్తున్నానని, 16 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకొని మరో 19ఏళ్ల వరకు సర్వీసు ఉన్నప్పటికీ సర్వీసును త్యాగం చేసి ఎన్నికల బరిలో నిలుస్తున్నానని, మీ అందరి పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట రాములు, మాజీ సర్పంచు పడాల అజయ్‌గౌడ్, నాయకులు తానిపర్తి తిరుపతిరావు, డాక్టర్ లాద్య శ్రీనివాస్, పడాల రవి తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞవరాహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 20: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాత, సంస్కృత పండితుడు, ఆధ్యాత్మిక గురువు, పద్మశ్రీ, మహామహోపాధ్యాయ స్వర్గీయ శ్రీభాష్యం విజయసారథి ఆశీస్సులతో ఆదివారం ఉదయం పుణ్యాహవాచనం, నూతన కల్యాణ మండప వాస్తు హోమం, సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, మాడవీధి ఉత్సవం, విశ్వక్సేనారాధన, మేదినీపూజ, అంకురార్పణ, ధ్వజపట ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా నేడు సోమవారం ఉదయం ధ్వజారోహణం, చతుర్దశ కలశ స్నపనం, సాయంత్రం ఎదుర్కోలు, అగ్నిప్రతిష్ఠ, హిరణ్యాక్ష సంహారలీల, రాత్రి శేషవాహనం జరుగనున్నాయి.

రెడ్డి సంఘాల నాయకులకు సన్మానం


రెడ్డి సంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

భగత్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసి ఆధ్వర్యంలో సీతారాంపూర్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంఘం ఫంక్షన్ హాలులో రెడ్డి సంఘాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో పనిచేసిన రెడ్డి సంఘం ప్రముఖులను ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పమ్మగారి రాంరెడ్డి, ఉత్తర తెలంగాణ జేఏసి అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జున్నూతుల రాజిరెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, కుందూరు లక్ష్మారెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి, గన్ను మహేందర్‌రెడ్డి, దాసరి రాంరెడ్డి, దారం జగన్నాథరెడ్డి, ఏడబోయిన శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం పటిష్టానికి సహకరించండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెరిక సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్ కోరారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన పెరిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

బీఆర్ఎస్‌ను వీడను.. బీజేపీలో చేరను

(ఐదో పేజీ తరువాయి)

కార్పొరేటర్లమందరం కలిసి ఆయన ఇంటికి వెళ్లి అభినందించాము. దానిని గిట్టనివారు రాజకీయ రంగు పులిమి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేనివారే ఈ ప్రచారాన్ని ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి: స్మార్ట్‌సిటీని ఎవరు మంజూరు చేయించారు.. ఈ విషయం బీఆర్ఎస్, బీజేపీలో వివాదంగా మారింది కదా... ?

మేయర్: ఎంపీగా, బి వినోద్‌కుమార్ ఉన్న సమయంలో కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా ఎంపిక చేయించడానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఢిల్లీకి ప్రతిపాదనలు పంపారు. అందుకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సంపూర్ణ సహకారం అందించారు. వీరితోనే స్మార్ట్‌సిటీ మంజూరైంది. 2020 వరకు స్మార్ట్‌సిటీ పనుల్లో 20 లక్షల విలువ చేసేవి మాత్రమే జరిగాయి. 2019లో ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌కుమార్ స్మార్ట్‌సిటీ నిధుల విడుదల్లో చొరవ చూపారు. ఆ కారణంగానే కేంద్రం 390 కోట్లు విడుదల చేయగా రాష్ట్రం కూడా 360 కోట్లు మంజూరు చేసింది. బండి సంజయ్‌కుమార్ నిధుల విడుదలకు సహకరించారని చెప్పిన విషయాన్నే వక్రీకరించి రాజకీయ దుష్ప్రచారం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌తో ఇటీవల సాన్నిహిత్యం పెరిగిందని విమర్శలు వస్తున్నాయి.. దీనిపై మీ కామెంట్?

మేయర్: ముమ్మాటికీ కాదు.. ఆయన కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా నాతో రెండుసార్లు కలిసి పనిచేశారు. విద్యార్థి దశలోనూ ఆయన ఏబీవీపీ నాయకుడిగా ఉంటే నేను ఎస్ఎస్‌యూఐ నాయకుడిగా పనిచేశాను. ఇద్దరికీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అదే సఖ్యతను ఇప్పుడూ కొనసాగిస్తున్నాము. ఎవరి రాజకీయాలు వారివే. మా పార్టీలు వేరైనా రాజకీయం వేరైనా కలిసి ఉండడం తప్పా.

ఆంధ్రజ్యోతి: స్మార్ట్‌సిటీ నిధులను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని జేబుల్లో నింపుకున్నారన్న ఆరోపణలకు మీ సమాధానమేమిటి?

మేయర్: స్మార్ట్‌సిటీ నిధుల వెచ్చింపు విషయంలో ఏ ఒక్కరికి నిర్ణయాలు తీసుకునే అధికారం లేదు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. దీనికి 12 మంది డైరెక్టర్లు ఉంటారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ప్రిన్సిపల్ సెక్రెటరీ చైర్మన్‌గా, మున్సిపల్ కమిషనర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటారు. మేయర్‌గా నేను ఒక డైరెక్టర్‌ను మాత్రమే.. మిగతా డైరెక్టర్ పోస్టుల్లో అధికారులు ఉంటారు. టెండర్లు పిలిచే అధికారం కమిషనర్లది. ఫైనల్ చేసేది, చెల్లింపులు చేసేది అధికార యంత్రాంగమే. ప్రతి టెండర్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. అంతా పారదర్శకంగా జరుగుతుంది. ఏ అవకతవకలు జరిగినా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. నేను కానీ, ఏ ప్రజాప్రతినిధికానీ స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతికి పాల్పడలేదు.

ఆంధ్రజ్యోతి: బీఆర్ఎస్‌లో మీకు, డిప్యూటీ మేయర్‌కు మధ్య వివాదం ఎందుకు?

మేయర్: నాకు ఎవరితో గొడవ లేదు. ఎన్నికలు జరిగిన సమయంలో 60 మంది కార్పొరేటర్లకుగాను 33 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు గెలిచారు. ఏడుగురు ఇండిపెండెంట్లు పార్టీలో చేరారు. ఏడుగురు ఎంఐఎం కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు మద్దతు పలికారు. వీరందరి మద్దతుతో మేయర్‌గా బాధ్యతలు చేపట్టాను. అందరితో కలిసి కార్పొరేషన్ అభివృద్ధికి కృషిచేశాను. నాకైతే ఎవరితో ఎలాంటి విభేదాలు లేవు. అందరికీ ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చాను. డిప్యూటీ మేయర్ మనసులో ఏముందో నాకు తెలియదు. నేను ఏ తప్పు చేయలేదు. కార్పొరేషన్‌లో ఏ అభివృద్ధి పని జరిగినా ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు తెలియకుండా జరుగలేదు.

ఆంధ్రజ్యోతి: మాజీ మంత్రి కమలాకర్‌తో కలిసి పనిచేస్తారా... కేంద్రమంత్రి బండి సంజయ్ బాటలో నడుస్తారా..?

మేయర్: నేను 2014 నుంచి బీఆర్ఎస్‌లో క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తున్నాను. 1987 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో, వివిధ పదవుల్లో పనిచేశాను. ఆనాడు ఆపార్టీలో ఉన్న పరిస్థితుల కారణంగా బీఆర్ఎస్‌లో చేరాను. పదేళ్లుగా క్రమశిక్షణతో పనిచేస్తూ అందరి సహకారాన్ని పొందుతూ రాజకీయంగా ముందుకు సాగుతున్నాను. బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తిలేదు. బీజేపీలో చేరే ప్రస్తావనే లేదు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు ఆదివారం మృతి చెందారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్టు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజంపేట కల్లపెల్లికి చెందిన మామిడాల వాసు(40) కొన్ని రోజులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నేత కార్మికునిగా పని చేశాడు. అనారోగ్యంతో గురి కావడంతో కొన్ని రోజుల కింద కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో చెరాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కరీంనగర్ వెంకటేశ్వర దేవాలయం సమీపంలో కింద పడిపోయిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్ష్మణ్(60) అనే వ్యక్తి సెప్టెంబర్‌లో వెంకటేశ్వర దేవాలయం సమీపంలో కిందపడిపోవడంతో 108 వాహన సిబ్బంది అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

'ఆవోపా' సేవలు అభినందనీయం

-ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఐదు దశాబ్దాలుగా వైశ్యులకు, ఇతర సామాజిక వర్గాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటి రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఆదివారం నగరంలో నూతనంగా నిర్మించిన ఆవోపా జూబ్లీ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆవోపా కరీంనగర్‌శాఖ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ 50 ఏళ్ళ క్రితం కరీంనగర్‌లో ప్రారంభించిన ఆవోపాశాఖ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా జూబ్లీ ఉత్సవాల సందర్భంగా జూబ్లీ భవన్‌ను నిర్మించుకోవడం అభినందనీయమని, తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. ఆర్యవైశ్యుల్లోని పేదలకు ముఖ్యంగా పేద విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

ఈకార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర ముఖ్యసలహాదారుడు గంజి స్వరాజ్‌బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, నగర అధ్యక్షుడు నగునూరి రాజేందర్, ఆవోపా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నాగమల్ల మునీందర్, ఆవోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగన్నాథరెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న జగన్నాథరెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసీ కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దారం జగన్నాథరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అప్పమ్మగారి రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఉత్తర తెలంగాణరెడ్డి జేఏసీ అధ్యక్షులు పెండ్యాల రాంరెడ్డి నియామకం కాపీ అందించారు. తన నియామకానికి సహకరించిన రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు జన్నుతుల రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చుక్కారెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్‌రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కోశాధికారి కాసర్ల మధూకర్‌రెడ్డికి దారం జగన్నాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు వాడాలి


ఉల్లంపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న రైతులు

చిగురుమామిడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులు వాడి అధిక దిగుబడులు సాధించాలని సూపర్ సీడ్స్ విత్తన కంపెనీ ఏఆర్ఎం పి రాజగోపాల్ అన్నారు. మండలంలోని ఉల్లంపల్లి లో ఆదివారం సూపర్-126 రకం వరి సాగు చేసి అధిగ దిగుబడి సాధించిన రైతు బండారి వెంకటేశ్వర్లు, ఇతర రైతుల పొలాలను సందర్శించారు. రైతులకు సంబంధిత విత్తనంపై అవగాహన కల్పించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రామడుగు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గోపాల్‌రావుపేటలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాంకిషన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు


హుజూరాబాద్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జమ్మికుంటలో బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

హుజూరాబాద్/జమ్మికుంట/సైదాపూర్/ఇల్లందకుంట/వీణవంక/చిగురుమామిడి/చొప్పదండి/మానకొండూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా చెల్లించడంలో జాప్యంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. హుజూరాబాద్ తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సైదాపూర్‌లో నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సరిగోమ్ముల వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గంగాధర ప్రధాన రహదారిపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కంకణాల విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వీణవంక మండల కేంద్రంలోని జమ్మికుంట- కరీంనగర్ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. చిగురుమామిడి మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చొప్పదండిలో బీఆర్ఎస్ నా యకులు రాయపట్నం రహదారిపై రాస్తారోకో చేశారు. మానకొండూర్‌లోని పల్లెమీద బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కాంగ్రెస్‌తోనే మాదిగలకు న్యాయం

తిమ్మాపూర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. విశ్వ విద్యాలయాల కులపతుల నియామకాల్లో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత పదవులు హర్షణీయం

హుజూరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదిగ ప్రొఫెసర్లు ఉన్నత పదవులు పొందడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రం అన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయం లో ఆదివారం ఆయన మాట్లాడారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

గన్నేరువరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగపల్లి ఎక్స్ రోడ్ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని జిల్లా యూనియన్ సభ్యుడు సొల్లేటి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా జే మ్స్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధి కారిగా నరేందర్‌ను ఎన్నుకున్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్..

చొప్పదండి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): చొప్పదండి లారీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి ఎల్లయ్య, కార్యదర్శిగా ఆవుల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా నలుమాచు కాశీనాథం మేడి మల్లేశం ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా జాతరకొండ పర్వతాలు, మందల రాజిరెడ్డి, కోశాధికారిగా కటుకం మల్లికార్జున్, ముఖ్య సలహాదారులుగా ఆనందం, లక్ష్మయ్య, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కార్యవర్గం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 20: మండలంలోని రంగాపూర్ గ్రామ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ ఇసాక్, ఉపాధ్యక్షులుగా బొడ్డు సుమన్, బండ చొక్కయ్య, కార్యదర్శిగా బొడ్డు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులుగా బొడ్డు దేవదాసు, ప్రచార కార్యదర్శిగా బండ శ్రీనాథ్, కోశాధికారిగా ఇల్లందుల కుమార్, కార్యవర్గ సభ్యులుగా బొడ్డు లింగయ్య, మొగిళి, బండ కుమార్, రవి ఎన్నికయ్యారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ రూరల్: రూరల్ మండలం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎలబో తారం గ్రామానికి చెందిన సుధాకర్‌ను నియమించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అయిలేష్‌యాదవ్ తెలిపారు.

● బొమ్మకల్ గ్రామంలోని శ్రీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పురమల్ల లలిత, కరీంనగర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

● కృతికా నక్షత్రం సందర్భంగా నగునూరు గ్రామంలోని దుర్గాభవాని దేవాలయంలో మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు విశేష అభిషేకం, ఫల పంచామృతాభిషేకం, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కరీంనగర్ కల్చరల్: నగరంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో లీడ్ కరిక్యులంలో భాగంగా ఆదివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోక్వాలిటీ కో ఆర్డినేటర్ కె అశోక్‌రెడ్డి, డిస్ట్రిక్ సైన్స్ ఆఫీసర్ సీహెచ్ జయపాల్‌రెడ్డి, సైన్స్ రిసోర్స్ పర్సన్ ప్రిన్సిపల్ జంగ సునీతా మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నగరంలోని ఆలయాల్లో ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా గణపతి పూజలను, కృత్తికా నక్షత్రం సందర్భంగా సుబ్రమ్మణ్యస్వామి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్లబ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

హుజూరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హుజూరాబాద్ క్లబ్ అభివృద్ధిలో భాగస్వా మ్యం కావాలని మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. హుజూరాబాద్ క్లబ్‌లో ఆదివారం అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ హుజూరాబాద్ క్లబ్‌ను హనుమకొండ, కరీంనగర్ క్లబ్‌లకు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ సభ్యులు క్లబ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రతీ సభ్యుడు దీని కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టరేట్ పట్టా పొందిన క్లబ్ సభ్యులు పుల్లూరి ప్రభాకర్‌రావు, ఆవుల లక్ష్మయ్యను సన్మానించారు. సమావేశంలో ఎర్రం నారాయణరెడ్డి, పేరాల గోపాల్‌రావు, కళ్లెపు మోహన్‌రావు, చొల్లేటి కిషన్‌రెడ్డి, ముచ్చ నారాయణరెడ్డి, పీవీ శ్రీనివాస్‌రావు, కొండ గణేష్, కంకణాల భగవాన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బండ శ్రీనివాస్, శివనాథుని వేణు, తోట రాజేంద్రప్రసాద్, కల్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 20 (అక్టోబరు): ప్రభుత్వం చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్ లో ఆదివారం బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీ లించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు పురమల్ల మనోహర్, డీసీసీ ప్రధాన కార దర్శి రోమాల రమేష్,మాజీ వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు మహేష్, రుద్ర మ ల్లేశం నాయకులు పాల్గొన్నారు. కాగా గట్టుబూత్కూర్ అంబేద్కర్ సంఘం నాయకుడు పొత్తూరి సురేష్ తల్లి రాజేశ్వరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

శ్రీసరస్వతీ శిశుమందిర్‌కు రూ.లక్ష విరాళం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 20: నగరంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా నిర్వహిస్తున్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి అమెరికాలో ఉంటున్న జొన్నల మాధవీలత లక్ష రూపాయల విరాళాన్ని అందజేసింది. శ్రీసరస్వతీ శిశుమందిర్‌ను ఇంటర్నేషనల్ స్కూల్‌గా మార్చాలని విద్యాపీఠం తీసుకున్న నిర్ణయం మేరకు చేపట్టిన భవన నిర్మాణానికి మాధవీలత తనవంతు సహాయంగా లక్ష రూపాయల విరాళాన్ని ఆమె తల్లిదండ్రులు జొన్నల హన్మంతరెడ్డి దంపతుల ద్వారా పాఠశాల నిర్వాహకులకు పంపించారు.

ఈకార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి, కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, సహ కార్యదర్శి కొండ గంగాధర్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్‌రావు, శ్రీరామోజు రవి తదితరులు పాల్గొన్నట్లు ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.